సంక్షేమ ఫలాలు అందించేందుకే డిజిటల్ కార్డులు



సద్దలగుండులోని కుటుంబ డిజిటల్ కార్డు దరఖాస్తును చూపుతన్న ఓ ఇంటి యజమాని, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం, కౌన్సిలర్ స్వప్న, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డులు ఇవ్వబోతున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పాలమూరు పురపాలికలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 37వ వార్డు పరిధి సద్దలగుండులో తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ స్వప్న, పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అర్బన్, గ్రామీణ తహసీల్దార్లు ఘన్సీరాంనాయక్, సుందర్‌రాజ్, ఇతర రెవెన్యూ, పురపాలక సిబ్బందితో కలిసి సద్దలగుండులోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి డిజిటల్ కార్డుల ఆవశ్యకతను కుటుంబాలకు వివరించారు. కొందరు ఇళ్ల యజమానులకు కుటుంబ డిజిటల్ కార్డు దరఖాస్తులు భర్తీ చేయించి అధికారులకు అందజేశారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఇప్పటికే కుటుంబ కార్డుల విధానం విజయవంతమైందని తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు రాములుయాదవ్, అజ్మత్‌అలీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

చీకట్లోనే ధ్రువపత్రాల పరిశీలన

విద్యుత్తు లేకపోవడంతో జీహెచ్‌ఎంలు, అభ్యర్థుల ఇక్కట్లు



అభ్యర్థి తన సెల్‌ఫోన్ టార్చ్ వేయగా ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంలు

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో చేపట్టిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చీకట్లోనే కొనసాగింది. జీహెచ్‌ఎంలు ఇక్కట్లకు గురయ్యారు. గురువారం మధ్యాహ్నం తర్వాత వర్షం రావడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా కాలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఇబ్బంది పడకుండా అక్కడ విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంలు తమ చరవాణి టార్చ్‌లైట్ వేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎస్జీటీతో పాటు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. వారి కోసం 12 పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేశారు. డైట్ కళాశాల ఆవరణలో చెట్లు ఎక్కువగా ఉండటంతో గదుల్లోకి వెలుతురు సరిగ్గా రావటం లేదు. నిత్యం విద్యుత్తు దీపాల వెలుతురులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేనప్పుడు ఆ గదులన్నీ చీకటిగా మారి పాఠాల బోధన నిలిచిపోతోంది. ఆ గదుల్లోనే డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ అధికారులు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, వారి సహాయకులు వచ్చిన వారికి కూర్చోవడానికి సరైన బెంచీలు, సదుపాయాలు లేవు. విద్యాశాఖ అధికారులు కూడా ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఇబ్బందులు పడుతూనే జీహెచ్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు.



కిటికీ పక్కనే ఉన్నా.. వెలుతురు లేక సెల్‌ఫోన్ టార్చ్‌తో చూస్తున్న సిబ్బంది

ఇరుకుగా గదులు.. : డైట్ కళాశాలలోని నాలుగు గదుల్లోనే డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. మొదటి గదిని అభ్యర్థులు కూర్చుని దరఖాస్తులు పూర్తిచేయటం, అన్ని రకాల ధ్రువపత్రాలను జతచేసేందుకు కేటాయించారు. మిగిలిన మూడు గదుల్లో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి గదిలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయటంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గదులు చాలా చిన్నగా ఉన్నాయి. పక్క పక్కనే కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఇరుకుగా మారి అభ్యర్థులు, పరిశీలన చేసే విద్యాశాఖ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్తు సరఫరా లేకపోవటం మరింత సమస్యగా తయారైంది. కొన్ని కేంద్రాల్లో అభ్యర్థులు టార్చ్ వేస్తే జీహెచ్‌ఎంలు ధ్రువపత్రాలు పరిశీలించారు. విద్యాశాఖ సీఎంవో బాలుయాదవ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా విద్యుత్తు సమస్యపై సంబంధిత శాఖ అధికారులకు సమాచారమిచ్చామని, కొత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు.

కురుమూర్తి దేవస్థానం అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి



దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : పేదల తిరుపతిగా వెలుగొందుతున్న చిన్నచింతకుంట మండలం అమ్మపూరులోని శ్రీకురుమూర్తిస్వామి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన గౌని గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షుడిగా, నియోజకవర్గంలోని భారతి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, భాస్కరాచారి, నాగరాజు, రాఘవేంద్ర, కమలాకర్, రాము, గోపాల్, చక్రవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములును డైరెక్టర్లుగా ఎంపిక చేసినట్లు గురువారం దేవాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గోవర్ధన్‌రెడ్డి తదితరులు చెప్పారు. నూతన పాలకవర్గం త్వరలో ప్రమాణస్వీకారం చేయించనున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా.. అధికారులపై వేటు

అచ్చంపేట న్యూటౌన్, జడ్చర్ల : దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాలో విఫలమైన అధికారులపై వేటు పడింది. ప్రత్యేక నిఘా బృందం సేకరించిన సమాచారం మేరకు వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, బిజినేపల్లి ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వీరిని ఠాణా నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. జడ్చర్లలో ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను డీఏఆర్‌కు అటాచ్ చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్ల పరిధిలో మొదటిసారి ఎస్సైలపై వేటు పడటంతో గనులు, రెవెన్యూ, పోలీసు అధికారుల్లో చర్చ మొదలైంది. మార్చి నుంచి జూన్ వరకు వాగు పరిధిలో విధులు నిర్వహించి వసూళ్లకు పాల్పడిన అధికారుల్లో భయాందోళన మొదలైంది.



ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న పొక్లెయిన్(పాత చిత్రం)

● దుందుభి వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకున్న వ్యాపారులు ఈ ఏడాది జులై వరకు టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. ఉప్పునుంతల మండలం సదగోడు, మొల్గర, తిర్మలాపూర్, దాసర్లపల్లి, కాంసానిపల్లి, వంగూరు మండలం మిట్ట సదగోడు, చింతపల్లి, పోతిరెడ్డిపల్లి శివారు వ్యవసాయ పొలాల్లో డంపులు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ. 4వేల చొప్పున అధికారుల అండదండలతో అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలకు తరలిస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోనూ జోరుగా ఇసుక రవాణా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన అధికారులపై వేటు పడింది.

శక్తిపీఠంలో ఉత్సవాలు ప్రారంభం


ప్రదక్షిణ చేస్తున్న ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, మాలధారణ భక్తులు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఈవో పురేందర్, అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో ప్రధాన ఆలయాలకు చేరుకొని ఆనతి స్వీకరించారు. గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, కలశస్థాపన, యాగశాలలో నాలుగు వైపులా ప్రత్యేక మండపారాధన మధ్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులతో మహాకలశ స్థాపన చేశారు. లోక కల్యాణార్థం మహాసంకల్పం పాటించి అఖండ దీపారాధన చేశారు. షోడశోపచార పూజలు, తదితరాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు.

శైలపుత్రిగా జోగులాంబ: ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంతెన నుంచి వెళ్లలేక ఆగిన సుబాబుల్ లోడు లారీ

మొత్తుకున్నా వినలే.. ఎత్తు పెంచలే!

శాంతినగర్, న్యూస్‌టుడే: భారత్‌మాల రోడ్డు వంతెనల ఎత్తు పెంచాలని రైతులు మొత్తుకున్నా, నిరసనలు చేసినా, పనులను అడ్డుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు.. యాజమాన్యం ఒప్పుకోలేదు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న వీటి కారణంగా రైతులకు ఇదిగో ఇలా కష్టాలు తప్పవు. రాజోలి నుంచి శాంతినగర్‌కు వచ్చే రోడ్డుపైన నిర్మించిన వంతెన నుంచి వెళ్లలేక గురువారం ఆగిపోయిన సుబాబుల్ లోడు లారీ సాక్షిగా..

వేలాది గ్రామాలకు సమస్యే: గద్వాల జిల్లాలో భారత్‌మాల రహదారి ఎనభై కిలోమీటర్ల దూరం వెళుతోంది. రహదారికిరువైపులా వందలాది గ్రామాలున్నాయి. రహదారితో ప్రస్తుతం ఈ గ్రామాల నడుమ రాకపోకలు తెగిపోయాయి. అక్కడక్కడా నిర్మించిన పదుల సంఖ్యలో వంతెనలు ఇదిగో ఇలా తక్కువ ఎత్తులోనే ఉండిపోయాయి. దీంతో అటూ ఇటూ వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లడం కష్టం కానుంది. కాలువ కట్టలపైనైతే ఈ రహదారిని దాటే పరిస్థితే లేకుండాపోయింది. కాలువ వరకే వంతెన నిర్మించడంతో కట్టను రహదారిలో కలిపేశారు.

నిరసనలు తెలిపినా

వంతెనల ఎత్తు విషయంలో అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. గట్టు మండలంలో ఏకంగా నిరాహార దీక్షలు చేపట్టారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సమస్యపై మీడియాలో మొదటి నుంచీ కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం తుమ్మిళ్ల రైతులు లారీలో సుబాబుల్ తీసుకువస్తూ బ్రిడ్జి వద్ద ఇబ్బంది పడ్డారు. ఎత్తు తక్కువగా ఉండటంతో తీసుకువచ్చిన సుబాబుల్‌లో కొన్ని కిందకు దించి బ్రిడ్జి దాటిన తర్వాత తిరిగి లోడు చేసుకున్నారు. ఇది రైతులకు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల కింద నుంచి సుబాబుల్, ధాన్యం, పత్తి, మిరప, జొన్న, పశుగ్రాసం లాంటివి రవాణా చేయాలంటే ఇదే పరిస్థితి ఎదురుకానుంది.


సమ్మోహనం.. సుందరరూపం


మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి అలంకరణ


మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో ఉమాదేవిగా దర్శనం


అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో..


శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో


కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాల్లో ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జననిని దర్శించుకునేందుకు ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు.

-న్యూస్‌టుడే బృందం


పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మహబూబ్‌నగర్ : అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో ఆర్యవైశ్యులు


ఊట్కూరు: బిజ్వార్‌లో బండారు చల్లుకునే కార్యక్రమంలో భక్తులు


కొత్తకోట : కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా ..


అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు


గద్వాల : ప్రతిమను ఊరేగిస్తున్న తెలుగుపేట శివాలయం కమిటీ సభ్యులు


అయిజ అంబాభవానీ ఆలయంలో..


గద్వాల గంటవీధిలో..


ఊట్కూరు: అంబాత్రయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి


నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు సందర్భంగా బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు



అచ్చంపేట: కుంకుమార్చన చేస్తున్న భక్తులు


వనపర్తి: చిట్యాలలో..


మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీఆలయంలో భక్తుల సందడి

వృత్తి ఎస్పీ.. ప్రవృత్తి చిత్రలేఖనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృత్తిలో ఎస్పీగా ఉంటూ చిత్రలేఖనం, సాహిత్యాన్ని ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు రావుల గిరిధర్. తల్లి చీరలపైన వేసే డిజైన్లు, ఇంటి ఎదుట అలంకరించే ముగ్గులను చూసి చిత్రాలను గీయడంపై ఆసక్తిని పెంచుకున్నారాయన. సాహిత్యంపై మక్కువ కనబరుస్తూ కవితలు రాశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనే.. చిత్రాలు గీస్తూ, కవితలు రాస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపర్తి ఎస్పీ గిరిధర్.


చిత్రాలను గీస్తున్న ఎస్పీ రావుల గిరిధర్





స్వచ్ఛంద కార్యక్రమాల్లో

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు రావుల క్షేమ, నిరంజనాచారిల కుమారుడు గిరిధర్. ఆయన పీజీ వరకు చదువుకున్నారు. పలు స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సామాజిక సేవలు ఇష్టంగా భావించే వారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో జైల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించి వరంగల్‌లో విధులు నిర్వహించారు. 2010లో రాసిన సివిల్స్‌లో ఆయన ఉద్యోగం సాధించి డీఎస్పీగా గురజాల, భైంసా, సుల్తాన్‌బజార్, గజ్వేల్‌లో పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పోలీసు శాఖలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017లో ఎస్పీగా పదోన్నతి పొంది డీసీపీగా పనిచేశారు. ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

ప్రవృత్తిలో గురువు తల్లి

తన తల్లి క్షేమను ఆదర్శంగా తీసుకుని చిత్రలేఖనంలో ఆసక్తిని పెంచుకున్నారు. ఆమెకు డిజైనింగ్‌లో ప్రవేశముంది. ఇంటి వద్ద ఆమె వేసే వివిధ రకాల డిజైనింగ్ బొమ్మలను చూసి అనుకరించేవారు. ఇంటి ఎదుట వేసే వాటిని చిత్రరూపంలో ప్రదర్శించడానికి ఆసక్తి కనబర్చేవారు. ఇలా సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆసక్తిని కలిగించే బొమ్మలను గీసేవారు. ఇప్పటి వరకు 60 వరకు బొమ్మలను గీశారు. ఆయన గీసిన బొమ్మలలో జంతుప్రపంచం, పక్షులు, చెట్లు, సెలయేరు వంటి పకృతి రమణీయతలను తన చిత్రాల్లో పొందుపరుస్తున్నారు. సాహిత్యంలోనూ మక్కువ ప్రదర్శిస్తున్నారు. కవితలంటే ఆయనకు పంచప్రాణం. శోధన పేరిట ఆయన కవిత సంపుటి 2020 సంవత్సరంలో ప్రచురితమైంది. పలు కవితలతో కూడిన మరో సంపుటి అహంబ్రహ్మస్మి అనే కవిత సంపుటి ప్రచురణలో ఉంది.

సమాజ హితమే పరమావధి : సమాజ హితమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తే ప్రజా సమస్యలకు తావుండదు. సేవ చేయాలన్న లక్ష్యం చిన్ననాటి నుంచే అలవడింది. పోలీసు శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉంటూ నా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన శ్రద్ధ వహిస్తున్నా. శాంతిభద్రతలే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నా. వృత్తిలో ఆదర్శంగా ఉండటంతో పాటు ప్రవృత్తిపై సమయం దొరికినప్పుడల్లా శ్రద్ధ చూపుతున్నా.

\- రావుల గిరిధర్, ఎస్పీ

పల్లె ఓటర్లు @ 23,22,054

పురుషుల కంటే 13,765 మంది మహిళలు అధికం

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 23,22,054 ఓటర్లున్నట్లు లెక్క తేల్చింది. పురుషులు 11,54,128 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11,67,893 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 13,765 మంది అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరుచేసి ఈ జాబితాను గత నెల 13న ప్రచురించారు. గ్రామ పంచాయతీల్లో వీటికి సంబంధించి గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది జాబితా ప్రచురించగా దీన్ని ఎన్నికల సంఘం వెలువరించింది. దీని ఆధారంగా జిల్లాల వారీగా పంచాయతీలు, వార్డుల్లోని ఓటర్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరో పర్యాయం ఓటరు నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

* నాలుగు జిల్లాల్లో అతివలదే పైచేయి.. : తాజాగా ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ల ఆధారంగా నాలుగు జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో పురుషుల కంటే మహిళలు 7,348 మంది అధికంగా ఉండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళా ఓటర్లు ఏకంగా 5,562 మంది అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,118 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వనపర్తి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 753 మంది ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పురుష ఓటర్లు మహిళల కంటే 1,016 మంది అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు, పంచాయతీలు, వార్డులు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగులాంబ	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03748

నవరాత్రి వేడుకల్లో రాజవంశీయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలిటెక్నిక్ బంగ్లా పక్కన గుడిలో గురువారం నిర్వహించిన నవరాత్రి పూజల్లో రాజా రామేశ్వర్‌రావు వారసుడు రాజా కృష్ణదేవరాయుడు కుమారుడితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు రాజా వారిని కలిసి సన్మానించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సతీశ్ యాదవ్ మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు.


రాజవంశీయులతో అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోటవెలుగు మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న అర్జున్ 45 పరుగులతో విజయంలో కీలక పాత్ర పోషించారు.


సెంచరీతో రాణించిన నిజామాబాద్ జట్టు క్రికెటర్ విక్రాంత్‌రెడ్డి (137 పరుగులు)

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో అలెగ్జాండర్ రక్షిత్ 39 పరుగులు చేశాడు. ... 3 వికెట్లు తీశారు. శుక్రవారం కోటవెలుగు మైదానంలో కరీంనగర్, నల్గొండ, మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో మార్పు కోసమే పాదయాత్ర

ఉండవల్లి, న్యూస్‌టుడే: భావితరాలకు ఉపయోగపడే విధంగా నడుచుకునేలా ప్రజల్లో మార్పు కోసమే 'బహుజన రాజ్యాధికార పాదయాత్ర' చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి హైదరాబాద్ వరకు (100 రోజులు 1000 కి.మీ) పాదయాత్ర గురువారం ఉండవల్లికి చేరుకుంది. గ్రామస్థులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తల్లిదండ్రులు, పెద్దలు అలవాటు చేయాలన్నారు. చేతి వృత్తుల వారికి ప్రోత్సాహం, మద్యం, మత్తు పదార్థాల నివారణ, స్వదేశీ వైద్యం ఆదరించటం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం, యోగా, ప్రాణాయామం, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అందించడం తదితరాలను వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు. యాత్ర శుక్రవారం ఉండవల్లి నుంచి బీచుపల్లి కొనసాగుతుంది.


కరపత్రాలు అందజేస్తున్న శివార్చక విజయకుమార్ తదితరులు

పోలీస్ అధికారుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి : డీఐజీ


మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ రావుల, అధికారులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారుల నైపుణ్య కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నేరస్థులు ఎవరూ తప్పించుకోకుండా నేరాల విచారణ, పరిశోధన మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యశాలలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి, ఎస్పీలు, వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, న్యూస్‌టుడే: విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్ల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముండే ఓ విద్యార్థిని(17) మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

ఫారం	112-00
రిటైల్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00

తెరపై ఈనాడు

బాలాజీ - **దేవర,** తిరుమల - **దేవర,** వెంకటేశ్వర్ల - **దేవర** వెంకటాద్రి - **సత్యం సుందరం,** శ్రీకృష్ణ - **జోకర్** (ఉదయం ఆటలు), **దక్షిణ** (రాత్రి ఆటలు)
– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

శైలపుత్రిగా జోగులాంబ



అలంపూర్, న్యూస్‌టుడే : జోగులాంబ ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అర్చకులు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.

బాదేపల్లి మార్కెట్ పాలకవర్గం ఎంపిక

జడ్చర్ల, న్యూస్‌టుడే : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిసింది. ఛైర్‌పర్సన్‌గా ఎంపికైన తంగేళ్ల జ్యోతి, ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్, పాలకవర్గ సభ్యులుగా కృష్ణయ్య, రాజునాయక్, కుర్మిద్దె యాకూబ్, లక్ష్మయ్య, ఖాజా అలీమోదీన్, సత్యనారాయణగౌడ్, నారాయణరెడ్డి, కొంగళి యాదయ్య, ద్యాప శ్రీనివాస్‌రెడ్డి, బంగారయ్య, సునీల్, శివకిశోర్‌కుమార్‌లను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఈ నెల 9న ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తంగేళ్ల జ్యోతి పేర్కొన్నారు. ఈ విషయమై బాదేపల్లి మార్కెట్ కార్యదర్శిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇంకా తమ కార్యాలయానికి అందలేదని తెలిపారు.

నేటి నుంచి శిక్షణ

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నుంచి గ్రామాల్లోని మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఈ సమీఉల్లాఖాన్ తెలిపారు. నీటిశుద్ధి, త్రీఫేజ్, సింగిల్ ఫేజ్ మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీ, చేతిపంపుల మరమ్మతులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రాజాపూర్ : గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నీరు వదులుతున్న వాటర్‌మెన్ (మంచినీటి సహాయకులు)లకు గురువారం రాజాపూర్‌లో ఏఈ అభినవ్ శిక్షణ ఇచ్చారు. మంచినీటిపై పరీక్షలు నిర్వహించి, ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీవో మచ్చేందర్, ఎంపీవో వెంకట్రాములు, కార్యదర్శి జ్ఞానేశ్వర్, శివకుమార్, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై నిరసన

జడ్చర్ల, న్యూస్‌టుడే: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జడ్చర్ల కోర్టు ఆవరణలో గురువారం నిరసన చేపట్టారు. హైదరాబాద్‌లో కూకట్‌పల్లికి చెందిన న్యాయవాదిపై బోరబండ ప్రాంతానికి చెందిన పోలీసులు దాడి చేయడం పట్ల నిరసన తెలిపారు. కార్యక్రమంలో జంగయ్య, తిరుపతి, మహేశ్వర్‌రెడ్డి, మాలిక్‌షాకీర్, యాదిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ : ఏనుగొండ అక్షరకాలనీలోని దుర్గామాతకు మహిళల పూజలు



మిడ్జిల్ : పూజలు చేస్తున్న గ్రామస్థులు



జడ్చర్ల : సకల దేవతల ఆలయంలో..



దేవరకద్ర : అమ్మవారి సన్నిధిలో..

దుర్గమ్మా.. చల్లంగా చూడమ్మా!

న్యూస్‌టుడే బృందం : అమ్మా భవానీ.. లోకాలనేలే ఓంకార రూపమమ్మా.. మము చల్లంగా చూడవమ్మా.. అంటూ భక్తులు దుర్గామాతను ఆరాధించారు. జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను మొదటిరోజు ఉమాదేవిగా, బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు స్వగృహం నుంచి పట్టువస్త్రాలు, బంగారు చీర, ఆభరణాలతో ఊరేగింపు నిర్వహించగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సంఘం నేతలు వేణుగోపాల్, నాగరాజు, ప్రమోద్‌కుమార్, చక్రధర్ గుప్తా పాల్గొన్నారు. అంబాభవానీ మాత సన్నిధిలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు. వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీమాత ఆలయంలో సామూహిక పారాయణం నిర్వహించారు. పద్మావతి కాలనీలోని కాళికాదేవి ఆలయం, శ్రీనివాసకాలనీలోని వాసవీమాత ఆలయం, నాగేంద్రనగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త పోతుల రాంరెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. బాలాజీనగర్, భగీరథకాలనీ, పాత పాలమూరు, వీరన్నపేట, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఏనుగొండ తదితర ప్రాంతాల్లో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ పూజలు చేశారు. జడ్చర్ల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, సకల దేవతలు, సంతోషిమాత ఆలయాలు, రామమందిర్, కావేరమ్మ పేటలో చావిడి వద్ద అమ్మవారి ఉత్సవాల విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. మొదటి రోజు సకల దేవతల ఆలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవరకద్ర పట్టణంలో దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞాన సరస్వతీమాత దేవాలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. భూత్పూర్, తాటికొండ, కర్వెన, రావులపల్లి, వెల్కిచర్ల, తాటిపర్తి, పాతమొల్గర, మద్దిగట్ల గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాలానగర్ మండలం ఉడిత్యాలలో ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు శివాంజనేయ భక్తభజన మండలి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. పెద్దరేవల్లిలో తిరుమలనాథ స్వామి గుట్టపై శ్రీ భూదేవి అమ్మవారికి భక్తులు అభిషేకం నిర్వహించారు. మిడ్జిల్, అడ్డాకుల, మూసాపేట, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఊరూరా అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు.



మహబూబ్‌నగర్ : వీరన్నపేటలోని చౌడేశ్వరీ మాత ఆలయంలో ఉమాదేవిగా అలంకరణ







మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో హారతినిస్తున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్.. జానంపేటలో.. మన్సూర్‌పల్లితండాలో తుల్జాభవానీ ఆలయంలో..



మహ్మద్‌హుసేన్‌పల్లిలో దీక్షాపరులు



బాలానగర్ మండలం ఉడిత్యాలలో



మహమ్మదాబాద్ బీసీ కాలనీలో..



భూత్పూర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారు

కాటమయ్యస్వామి గుడి నిర్మాణానికి కృషి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గౌడ సామాజిక వర్గీయుల ఆరాధ్యుడు కాటమయ్యస్వామి దేవాలయ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు గౌడసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. గురువారం ఏనుగొండ సాంబశివాలయం ఎదుట ఉన్న స్థలాన్ని గురువారం గౌడ సామాజికవర్గ పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు ఆరాధించే కాటమయ్య దేవాలయం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనందున మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో పాటు గౌడ సంఘం పెద్దల సహకారంతో దేవాలయంతో పాటు గౌడ సంక్షేమ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం, గౌడ ఉద్యోగుల సంఘం, గీతాపారిశ్రామిక సహకారం సంఘం సభ్యులు సాయులుగౌడ్, వెంకటస్వామిగౌడ్, నారాయణగౌడ్, సత్యనారాయణగౌడ్, శివరాములుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గుడి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, గౌడ సామాజికవర్గం నాయకులు

లోపాలు లేకుండా సర్వే చేయండి : కలెక్టర్

హన్వాడ, న్యూస్‌టుడే : కుటుంబ సర్వేను లోపాలు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర సూచించారు. గురువారం హన్వాడ మండలంలోని మాదారంలో నిర్వహించిన కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. అన్ని రకాల సమాచారం సేకరించి పత్రంలో పూర్తిచేయాలని సూచించారు. ఫొటోల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరి అంగీకారం లేకుండా ఫొటోలు తీయరాదన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు అడగరాదన్నారు. గ్రామంలో ఉన్న 163 కుటుంబాలను కలవాలన్నారు. ప్రజలు కూడా పూర్తిగా సహకరించాలని కోరారు.

భూత్పూర్ : కుటుంబ డిజిటల్ కార్డు జారీ ప్రక్రియలో ప్రతి కుటుంబాన్ని గుర్తించేలా ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్ సూచించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా భూత్పూర్ 9వార్డును ఎంపిక చేయడంతో గురువారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఆమోదం మేరకే డిజిటల్ కార్డుల రూపకల్పన జరుగుతుందని చెప్పారు. సభ్యులకు సర్వే విషయాన్ని ముందే చేరవేసి అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే ఆధారంగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు వివరాలను అధికారులకు తెలియజేయాలని చెప్పారు. కమిషనర్ సురేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జడ్చర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని 24వ వార్డులో అధికారులు డిజిటల్ కార్డు సర్వే చేపట్టారు. సర్వే చేపట్టాల్సిన అంశాలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాదారంలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పాలమూరు, న్యూస్‌టుడే : న్యాయవాదులు గురువారం తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయం నుంచి తెలంగాణ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు న్యాయవాది అబ్దుల్ హలీంపై మాదన్నపేట పోలీసులు విచక్షణ రహితంగా దాడి చేయడం సరికాదని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. న్యాయవాదులంతా ఏకతాటిపై ఉండి దాడులను నియంత్రణ చేయడానికి కృషి చేయాలన్నారు. దసరా తర్వాత న్యాయవాదుల సమస్యలపై పోరాటం ఉద్ధృతం చేస్తామన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజాయి నూనె రవాణాదారుల అరెస్టు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై గంజాయి నూనె (హాష్ ఆయిల్)ను రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం ఏనుగొండ సమీపంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ధర్మేంద్రరాయ్, నరెట్టమ్‌రాయ్ గంజాయి నూనెను హైదరాబాద్, రాయచూర్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఎండు గంజాయి ఆకులతో ఈ నూనె తయారు చేస్తారు. ఆ నూనెను మత్తు కోసం సిగరెట్ తాగేటప్పుడు వాడుతారు. గురువారం ఇద్దరు నిందితులు హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు గంజాయి నూనెను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది. వారు మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ వద్ద తనిఖీలు చేయగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.25లక్షల విలువ చేసే గంజాయి నూనె లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివ, సిబ్బంది మౌలాలీ, శివదాస్, భరత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ముసుగులో నిందితులు

ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ!

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : బతుకమ్మ పర్వదిన వేడుకల రెండో రోజు గురువారం అటుకుల బతుకమ్మగా అలంకరించి ఆడపడుచులు పూజలు చేశారు. జిల్లావ్యాప్తంగా పూల పండగను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణం సింహగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో, శివశక్తినగర్, వేంకటేశ్వరకాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, భగీరథకాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ, కోలాటం ఆడుతూ పాటలు పాడారు.

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలో పలు దేవాలయాలను దర్శించి అక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలకు పూజలు చేశారు. సింహగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకవచ్చి సమర్పించారు. శ్రీనివాసకాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన దుర్గామాతను, సద్దలగుండులో శ్రీవీరాంజనేయస్వామి అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఎమ్మెల్యే యెన్నం దర్శించి పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు బెక్కరి అనిత, పెద్ద విజయ్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, అజ్మత్‌అలి, పోల శ్రీనివాస్, ఓంప్రకాశ్ బాంగడ్, అనంతరెడ్డి, అచ్చన్న, వెంకటేశ్, నాగేశ్వర్ పాల్గొన్నారు.



సింహగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు



టీచర్స్‌కాలనీలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బతుకమ్మతో మహిళలు, చిన్నారులు



సింహగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు

వాననీటిలో కొట్టుకుపోయిన మొక్కజొన్న

జడ్చర్ల, న్యూస్‌టుడే : బాదేపల్లి మార్కెట్‌లో రైతులు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న పంట గురువారం మధ్యాహ్నం కురిసిన వానతో నీటిలో కొట్టుకుపోయింది. 181 మంది రైతులు 6,689 క్వింటాళ్ల మొక్కజొన్నను తీసుకొచ్చారు. తేమ ఎక్కువ ఉండటం, షెడ్లు నిండిపోవడంతో ఆరుబయట కుప్పలు పోశారు. టెండర్ల ప్రక్రియ జరిగాక ఒక్కసారిగా వర్షం వచ్చింది. మార్కెట్ ఆవరణలోని పల్లపు ప్రాంతంలో ఉన్న మొక్కజొన్న నీటితో కాల్వలోకి కొట్టుకుపోయింది. మిడ్జిల్ మండలం వేములకు చెందిన గోపాల్ అనే రైతు తాను ట్రాక్టర్ మొక్కజొన్న పంట తీసుకరాగా సగం నీటిపాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. తిమ్మాజిపేట మండలం మరికల్‌కు చెందిన శేఖర్‌రెడ్డి 50 బస్తాల మొక్కజొన్న తీసుకరాగా 10 బస్తాల వరకు కొట్టుకపోయింది. మిగిలింది తడిసి ముద్దయ్యింది. జడ్చర్ల మండలం గొల్లపల్లి పంచాయతీ పెద్దాయకుంటతండాకు చెందిన రైతు కృష్ణకు చెందిన 15 బస్తాల మొక్కజొన్న పంట కొట్టుకపోయింది. వర్షంలో మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. తడిసిన మొక్కజొన్నను కూడా కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు.

నెల రోజులు 30 పోలీస్ చట్టం అమలు : ఎస్పీ

పాలమూరు, న్యూస్‌టుడే : జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా ప్రశాంత వాతావరణాన్ని ఉంచేందుకు ఈ నెల 3 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 30 పోలీస్ చట్టం అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి. జానకి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి, పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు.

ఉద్యానవనం స్థలాన్ని పరిరక్షించాలి

మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: పురపాలిక పరిధి 5వ వార్డు ఏనుగొండ పోచమ్మ కాలనీలో పార్కు స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కాలనీవాసులు పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పార్కు స్థలాన్ని రక్షించటంతో పాటు అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణం, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షకార్యదర్శులు కొండ పురుషోత్తంరెడ్డి, రాఘవాచారి, ప్రతినిధులు వెంకటయ్య, రమేశ్, మధుసూధన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధ్రువపత్రాలు పరిశీలించండి : ఆర్‌జేడీ

పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఉద్యోగాల కోసం 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో కాస్ట్, కన్వకేషన్ సర్టిఫికెట్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకురాలు(ఆర్జేడీ) విజయలక్ష్మి ఆదేశించారు. మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలో ఉన్న డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థులకు సంబంధించిన అన్ని రకాల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొన్ని ధ్రువపత్రాలు లేని వారికి గడువు ఇవ్వాలని సూచించారు. గడువు లోగానే అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. కేంద్రంలో సహాయక కేంద్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని విద్యాశాఖ పర్యవేక్షకుడు శంబూప్రసాద్‌ను ఆమె ప్రశ్నించారు. రెండో రోజు 217 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను విద్యాశాఖ సిబ్బంది పరిశీలన చేశారు. కార్యక్రమంలో సీఎంవో బాలు యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువపత్రాల పరిశీలనను తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

అడ్డాకుల, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం అదుపు తప్పి గాయపడిన వ్యక్తి మృతిచెందిన ఘటన అడ్డాకుల మండలం పరిధిలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కిష్టాపురం గ్రామానికి చెందిన సాధిక్ వలి(27), షేక్‌దాదులు ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బుధవారం సాయంత్రం బయలుదేరారు. అడ్డాకుల సమీపంలోకి చేరుకోగానే వీరు ప్రయణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారి కిందకు దూసుకువెళ్లింది. ప్రమాదంలో సాధిక్ వలికి తీవ్ర గాయాలు కాగా షేక్‌దాదు స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాధిక్ వలి పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు కర్నూలుకు తరలించగా అక్కడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సాధిక్ వలి భార్య హరీఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భూత్పూర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారి-44పై దివిటిపల్లి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. భూత్పూర్ ఎస్సై చంద్రశేఖర్ కథనం మేరకు... భూత్పూర్‌కు చెందిన ఎల్లప్ప, అదే గ్రామానికి చెందిన కుమ్మరి శివ(35)ను తీసుకొని తన ద్విచక్రవాహనంపై తాటిపర్తికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో శివ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శివ సోదరి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

బాలానగర్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఓ యువకుడు గాయపడిన ఘటన పెద్దాయపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాయపల్లి గ్రామ శివారులో ఓ ప్రైవేటు వెంచర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫింటోస్ షేక్ నెల రోజులుగా కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం విద్యుదాఘాతానికి గురై అతడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు..

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి లారీ ఢీకొట్టడంతో అంజమ్మ(45) అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి ఆందోళకరంగా ఉన్నట్లు సమాచారం. నిర్లక్ష్యంగా లారీ నడిపి గాయపర్చిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం అంజమ్మ కుమార్తె అనిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

బాలానగర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డు దాటే సమయంలో వెనుక వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి గాయాలు కాలేదు.

మట్టి టిప్పర్ పట్టివేత

బాలానగర్, న్యూస్‌టుడే : అప్పాజిపల్లి నుంచి షాద్‌నగర్‌కు వెళ్తున్న మట్టి టిప్పర్‌ను బాలానగర్ మండల కేంద్రంలో పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది గురువారం పట్టుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం

హన్వాడ, న్యూస్‌టుడే : మునిమోక్షంలో మృతిచెందిన దండు అంజిలయ్య శవానికి గురువారం శవపరీక్ష నిర్వహించారు. దండు అంజిలమ్మ తన భర్త అంజిలయ్య గత జనవరిలో మృతి చెందాడని, ఈ విషయంలో తనకు అనుమానాలు ఉన్నాయని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు గురువారం హన్వాడ పోలీసులు, జిల్లా ఆసుపత్రి వైద్యులు, తహసీల్దార్ కిష్ట్యానాయక్ సమక్షంలో పూడ్చిన శవాన్ని వెలికితీసి శవపరీక్ష నిర్వహించారు.

అదృశ్యం కేసు నమోదు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్‌బర్గ జిల్లా కల్లూర్ గ్రామానికి చెందిన శాంతకుమార్(23) జడ్చర్ల పట్టణం నిమ్మబావిగడ్డ వద్ద ఉన్న పెట్రోలు బంక్‌లో పని చేస్తున్నాడు. అతడు ఈ నెల 1 నుంచి కనిపించకుండాపోయాడు. పెట్రోల్ బంక్ నిర్వాహకుడు పెరుమాళ్ల శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

పసిడి పతకాలు సాధించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు స్వర్ణ పతకాలు సాధించి పెట్టాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ ఆకాంక్షించారు. గురువారం డీఎస్ఏ మైదానంలో అండర్-14, 16, 18, 20 బాల, బాలికల అథ్లెటిక్స్ జిల్లా ఎంపికలను ప్రారంభించి మాట్లాడారు. 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 7,8 తేదీల్లో వరంగల్‌లో నిర్వహిస్తున్నట్లు శరత్‌చంద్ర తెలిపారు. ఒలింపిక్ సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేశ్ చందర్, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్ చంద్ర, శిక్షకులు ఆనంద్, సునీల్, సాదిఖ్ అలి, ప్రతినిధులు రమేశ్ బాబు, సి.శ్రీనివాసులు, జి.రాజు, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిశీలన కేంద్రంలో అడ్డంకుల తొలగింపు

పాలమూరు, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ధ్రువపత్రాల పరిశీలనలో అభ్యర్థుల రాకపోలకు ఇబ్బందికరంగా బెంచీలు ఉన్న వైనంపై 'ఈనాడు' కథనం ప్రచురితం కాగా విద్యాశాఖ అధికారులు స్పందించారు. గురువారం బెంచీలను తొలగించారు.

దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కల్యాణ మండపంలో దివ్యాంగులకు నిర్వహించిన ఉపాధి శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్వాడ, కోయిలకొండ మండలాలకు చెందిన 32 మంది దివ్యాంగులకు రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ గురుదేవి, మహబూబ్‌నగర్ క్లస్టర్ మేనేజర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.